సాక్షి
కామారెడ్డి
గురువారం । 13 । మార్చి । 2025



మహిళా శక్తి..
ప్రభుత్వం మహిళా సాధికారత కోసం కృషి చేస్తోందని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



గరిష్టం/కనిష్టం
37.7 /16.7

వాతావరణం
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

వాహనాల ఇన్సూరెన్స్ చెల్లించేందుకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి బల్దియాలో చెత్త తరలింపునకు వినియోగించే వాహనాలకు సంబంధించిన బీమా చెల్లించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ వాహనాలకు సంబంధించి బీమా రెన్యువల్ గడువు దాటి ఏడాది కావస్తోంది. ఈ విషయమై ఈనెల 10వ తేదీన 'సాక్షి'లో 'కార్మికులకు లేదు ధీమా' శీర్షికన ప్రచురిత మైన కథనంపై మున్సిపల్ అధికారులు స్పందించారు. వాహనాలకు ఇన్సూరెన్స్ చెల్లింపు ప్రక్రియను బుధవారం ప్రారంభించారు. బల్దియాకు సంబంధించిన సానిటేషన్ విభాగంలోని చెత్త సేకరణ ఆటోలు, ట్రాక్టర్ల ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించడానికి సంబంధించిన పత్రాలను సిద్ధం చేస్తున్నారు. వారంలోపు అన్ని వాహనాల ఇన్సూరెన్స్ చెల్లిస్తామని బల్దియా కమిషనర్ రాజేందర్‌రెడ్డి 'సాక్షి'తో తెలిపారు.

కామారెడ్డి ఆర్డీవోగా వీణ



కామారెడ్డి క్రైం : కామారెడ్డి ఆర్డీవోగా వీణ నియమితులయ్యారు. గతంలో ఇక్కడ ఆర్డీవోగా పని చేసిన రంగనాథరావు నెల క్రితం ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ ఇన్‌చార్జి బాధ్యతలు చూసుకుంటున్నారు. తాజాగా ప్రభుత్వం మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మైనారిటీ కార్పొరేషన్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న వీణను కామారెడ్డి ఆర్డీవోగా బదిలీ చేసింది. ఆమె బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పీఎం ఇంటర్న్‌షిప్ దరఖాస్తు గడువు పొడిగింపు

కామారెడ్డి అర్బన్ : ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకం రెండో దశ దరఖాస్తు గడువును ఈనెల 31 వరకు పొడిగించారు. ఈ విషయాన్ని జిల్లా పరిశ్రమల అధికారి మల్హార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం లేని 21 నుంచి 24 ఏళ్లలోపు వయసు వారు, పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీలలో ఏదైనా పూర్తి చేసినవారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. కుటుంబ వార్షికాదాయం రూ. 8 లక్షలలోపుగల వారు దరఖాస్తు చేసుకోవాలని, ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన వారికి నెలకు రూ. 5 వేల భత్యం అందిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 1800 11 6090 నంబర్‌లో లేదా పీఎం ఇంటర్న్‌షిప్ వెబ్‌సైట్‌లో సంద్రించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షలకు 207 మంది గైర్హాజరు

కామారెడ్డి టౌన్: జిల్లాలో బుధవారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం వార్షి పరీక్షలు నిర్వహించారు. జిల్లాలోని 38 కేంద్రాలలో 8,495 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా.. 8,288 మంది మాత్రమే పరీక్ష రాశారు. 207 మంది గైర్హాజరయ్యారు. జనరల్ గ్రూప్‌లలో 7,505 మంది విద్యార్థులకు గాను 7,351 మంది, వొకేషనల్ కోర్సులలో 990 మందికిగాను 937 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. జిల్లా ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలాం పరీక్షలను పర్యవేక్షించారు.

'నిజాంసాగర్ ప్రాజెక్టు కెనాల్ వైపు వెళ్లొద్దు'

నిజాంసాగర్: యాసంగి పంటల అవసరాల నిమిత్తం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్నందున ఎవరూ కెనాల్‌వైపు వెళ్లవద్దని నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్ సూచించారు. గురువారం నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. ప్రధాన కాలువలో నీటి ప్రవాహం అధికంగా ఉండనున్న నేపథ్యంలో కాలువలోకి వెళ్లి ప్రమాదాలను కొనితెచ్చుకోవద్దని సూచించారు.

మార్కెట్‌యార్డుకు వరుస సెలవులు

సుభాష్‌నగర్: నగరంలోని శ్రద్ధానంద్ గంజ్‌కు వరుస సెలవులు ప్రకటించినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ అపర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14న హోలీ, 15న దల్హండి, 16న ఆదివారం కావడంతో మార్కెట్ యార్డులో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవని పేర్కొన్నారు. రైతులు పంట దిగుబడులను మార్కెట్ యార్డుకు తీసుకురావొద్దని సూచించారు. 17వ తేదీ నుంచి యథావిధిగా మార్కెట్ యార్డులో క్రయవిక్రయాలు కొనసాగుతాయని తెలిపారు.



పిట్లంలో లూటీకి గురైన ఏటీఎం (ఫైల్)



ఏటీఎంలో కెమెరాలు పనిచేయకుండా స్ప్రే చేస్తున్న దొంగ (ఫైల్)

దొంగలు దొరికేనా?

- రెండు నెలల క్రితం పిట్లం ఏటీఎంలో చోరీ
- రూ. 17.70 లక్షలు మాయం
- పోలీసులకు సవాల్‌గా మిగిలిన కేసు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ఎన్నో కేసులను ఛేదిస్తున్న పోలీసులకు పిట్లం ఏటీఎం లూటీ కేసు సవాల్‌గా మారింది. దొంగలు గ్యాస్ కట్టర్‌తో ఏటీఎంను పగులగొట్టి రూ. 17.70 లక్షలు ఎత్తుకెళ్లారు. ఈ చోరీ జరిగి రెండు నెలలు గడుస్తున్నా పోలీసులు ఇప్పటికీ నిందితులను గుర్తించలేకపోయారు.

ఈ ఏడాది జనవరి 12(ఆదివారం) తెల్లవారుజామున 3.20 గంటల ప్రాంతంలో పిట్లం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలోకి దొంగలు ప్రవేశించారు. గ్యాస్ కట్టర్ సాయంతో ఏటీఎంను ధ్వంసం చేసి, అందులోనుంచి రూ. 17.70 లక్షలు దోచుకెళ్లారు. దొంగలు మహారాష్ట్ర వైపు నుంచి కారులో గ్యాస్ కట్టర్ మిషన్‌ను తీసుకుని వచ్చి దర్జాగా ఏటీఎంను లూటీ చేసుకుని వెళ్లారు.

ఛేదన 65 శాతమే..

ఒక కేసు పరిశోధన ముగిసి దొంగలను అరెస్టు చేశారో లేదో మరో కేసు ముందుకు వస్తోంది. జిల్లాలో బైకు దొంగతనాలు, ఫోన్‌ల దొంగతనాలు కామన్‌గా మారాయి. ఇదే సమయంలో తాళం వేసిన ఇళ్లలో పగలు, రాత్రి తేడా లేకుండా చోరీలు జరుగుతున్నాయి. గతేడాది జిల్లాలో పగటి పూట 17 దొంగతనాలు, రాత్రి పూట 191 దొంగతనాలు జరిగాయి. అలాగే సాధారణ దొంగతనాలు 5 వందల పైచిలుకు జరిగినట్లు ఇటీవల పోలీసుల వార్షిక నివేదిక ద్వారా వెల్లడైంది. గతేడాది 65 శాతం కేసులను ఛేదించి 53 శాతం సొత్తు రికవరీ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. అయితే ఏటీఎం లూటీ కేసులో దొంగలు ఆనవాళ్లు దొరక్కుండా జాగ్రత్త పడడంతో కేసును కొలిక్కి తేలేకపోతున్నారు. సీసీ ఫుటేజీలు, వేలిముద్రలు, సెల్‌ఫోన్ ట్రాకింగ్ వంటి వాటి ద్వారా పోలీసులు ఎన్నో కేసులను ఛేదిస్తున్నా ఏటీఎం లూటీ కేసులో మాత్రం ఇప్పటికీ ఎలాంటి పురోగతి సాధించలేదని తెలుస్తోంది.

పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు..

సీసీ ఫుటేజీల్లో కనిపించిన దాని ప్రకారం ఏటీఎంలోకి ఇద్దరు వ్యక్తులు రాగా, మరొకరు కారులో కూర్చుని ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరొకరు బయట గమనిస్తూ ఉండవచ్చని భావించారు. నలుగురు సభ్యులు గల ముఠా ఈ దోపిడీకి పాల్పడినట్టు పోలీసులు అంచనా వేశారు. దొంగలు పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు అనేక జాగ్రత్తలు తీసుకున్నట్టు స్పష్టమవుతోంది. సీసీ కెమెరాలు పనిచేయకుండా ఉండేందుకు స్ప్రే చేశారు. దొంగలు తమకు సంబంధించిన ఆధారాలేవీ దొరక్కుండా కూడా జాగ్రత్త పడ్డారు. ముఠా సభ్యులు ముఖం కనబడకుండా వస్త్రంతో చుట్టేసుకున్నారు. ఏటీఎంను లూటీ చేసిన అనంతరం దొంగల ముఠా వచ్చిన కారులోనే పారిపోయినట్లు భావిస్తున్నారు. అయితే 161 వ నంబరు జాతీయ రహదారి మీదుగా వెళ్లిన ముఠా.. టోల్ గేట్ మీదుగా కాకుండా సమీపంలోని మారుమూల గ్రామాల మీదుగా తిరిగి వెళ్లినట్టు తెలుస్తోంది. కాగా సంఘటన జరిగిన తర్వాత సమాచారం అందుకున్న పోలీసులు క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. టెక్నాలజీ సాయంతో నేరస్తులను గుర్తించి పట్టుకునేందుకు చేసిన ప్రయత్నాలేవీ ఫలించలేదని తెలుస్తోంది.

యువ వికాసంపై ఆశలు!

- స్వయం ఉపాధికి ప్రభుత్వం కొత్త పథకం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల కోసం..
- ఒక్కో యూనిట్‌కు రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందించనున్న సర్కారు



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ యువతకు ఉపాధి కల్పించేందుకు 'రాజీవ్ యువ వికాసం' పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుడుతోంది. రాష్ట్రంలో ఐదు లక్షల మందికి ప్రయోజనం కల్పించేందుకు ఈ పథకాన్ని తీసుకువచ్చింది. ఈ పథకం ద్వారా ఒక్కో జిల్లాకు కనీసం 10వేల మందికి ప్రయోజనం కలుగుతుందని ఆశిస్తున్నారు.

15నుంచి దరఖాస్తుల స్వీకరణ..

రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా ఒక్కొక్కరికీ రూ.3 లక్షలు బ్యాంకు లింకేజీ ద్వారా అందించనున్నారు. ఈనెల 15న నోటిఫికేషన్ విడుదల చేసి అదే రోజు నుంచి ఏప్రిల్ 5 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఏప్రిల్ 6 నుంచి మే 31 వరకు దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేసి జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మంజూరు పత్రాలు అందించనున్నారు. కాగా ఈ పథకంపై స్పష్టత రావాల్సి ఉంది. ప్రభుత్వం బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 3 లక్షలు అందిస్తామని చెబుతోంది. ఎంత సబ్సిడీ ఉంటుంది, లబ్ధిదారుడు ఎంత చెల్లించాలి, బ్యాంకు రుణం ఎంత అన్న విషయాలు తెలియాల్సి ఉంది. నోటిఫికేషన్ విడుదల రోజున స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

'అధికార' ముద్రేనా...

ప్రభుత్వాలు ప్రవేశపెట్టే స్వయం ఉపాధి పథకాల లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికార పార్టీ ముద్ర కనబడడం సహజంగా మారింది. గతంలోనూ అధికార పార్టీ పెద్దల కనుసన్నల్లోనే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరిగింది. ఈసారి కూడా అదే విధానం అమలైతే పథకం అభాసుపాలయ్యే అవకాశం ఉంటుంది. అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి ఉపాధి కోసం మంజూరు చేస్తేనే పథకం విజయవంతం అవుతుందని పలువురు యువకులు అభిప్రాయపడుతున్నారు.

'బాధ్యతతో వ్యవహరించాలి'



బాన్సువాడలో మాట్లాడుతున్న ఎస్పీ రాజేశ్ చంద్ర

బాన్సువాడ : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎస్పీ రాజేశ్ చంద్ర సూచించారు. బుధవారం బాన్సువాడ డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్సైలతో ఆయన సమావేశమయ్యారు. సరిహద్దుల గురించి ఆరా తీశారు. చోరీలు జరగకుండా రాత్రి వేళ గస్తీలు, పెట్రోలింగ్‌లు నిర్వహించాలని, 100కు కాల్ వస్తే వెంటనే స్పందించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ సత్యనారాయణ, బాన్సువాడ టౌన్, రూరల్, బిచ్కుంద సీఐలు అశోక్, రాజేశ్, నరేశ్, ఎస్సైలు పాల్గొన్నారు.

గాంధారిలో..

గాంధారి : ఎస్పీ రాజేశ్ చంద్ర బుధవారం గాంధారి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఆయన వెంట ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, సదాశివనగర్ సీఐ సంతోష్, స్థానిక ఎస్సై ఆంజనేయులు ఉన్నారు.

మోడల్ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలి

కామారెడ్డి క్రైం: ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో గృహనిర్మాణం, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, విద్యుత్‌శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 19 మండలాల్లో ఇందిరమ్మ మాడల్ ఇళ్ల గ్రౌండింగ్ చేశామన్నారు. వాటి నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. డోంగ్లీ మండలంలో మోడల్ ఇంటి నిర్మాణాన్ని గ్రౌండింగ్ చేయాలన్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులు నిర్మాణాలకు సిద్ధంగా ఉంటే మార్కవుట్ ఇవ్వాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విక్టర్, జెడ్పీ సీఈవో చందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, హౌసింగ్ పీడీ విజయపాల్‌రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, పంచాయతీ రాజ్, గృహనిర్మాణ శాఖల ఇంజినీర్లు పాల్గొన్నారు.

వేసవిలో అప్రమత్తంగా ఉండాలి

- వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : వేసవి కాలంలో అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లాలోని ఆస్పత్రుల్లో అవసరమైన మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి కాలంలో చేయకూడని పనులు, చేయదగిన పనులను ప్రజలకు వివరించేందుకు కరపత్రాలను పంపిణీ చేయాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థల సహకారంతో రద్దీ ప్రాంతాల్లో చలి వేంద్రాలు ఏర్పాటు చేయించాలన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో నిరంతరం నీరు అందుబాటులో ఉండేలా చూడాలని, నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆస్పత్రులలో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జిల్లా జనరల్ ఆస్పత్రి సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై శిక్షణ అందించాలన్నారు. బాన్సువాడలో సైతం సదరం క్యాంపు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, జిల్లా జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫరీదా బేగం, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త విజయలక్ష్మి, డీపీవో మురళి, డీఆర్‌డీవో సురేందర్, మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫోన్లను అవసరం మేరకే వాడాలి



విద్యార్థినికి కళ్లజోడు అందిస్తున్న కలెక్టర్

భిక్కనూరు: విద్యార్థులు ఫోన్లను అవసరం మేరకు మాత్రమే వినియోగించుకుంటే కళ్లకు ఎలాంటి ఇబ్బంది ఉండదని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పేర్కొన్నారు. బుధవారం జంగంపల్లిలోని జ్యోతీబా పూలే గురుకుల పాఠశాలలో రాష్ట్రీయ బాల స్వస్థ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అవసరమైన విద్యార్థులకు కళ్లజోళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆరు నెలలకోసారి తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. బాగా చదివితే జీవితం బంగారుమయం అవుతుందని పేర్కొన్నారు. పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, ఆప్తాల్మాలజిస్ట్ రవీందర్ పటేల్, ఆర్‌బీఎస్‌కే వైద్యులు మనోజ్, విజయ, మహాలక్ష్మి, పాఠశాల ప్రిన్సిపల్ విమలాదేవి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ



ర్యాగట్లపల్లిలో భూమిపూజ చేస్తున్న కలెక్టర్

భిక్కనూరు: ర్యాగట్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి బుధవారం కలెక్టర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 145 మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామన్నారు. త్వరగా ఇళ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి, తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రవికిరణ్, ప్రత్యేకాధికారి దేవేందర్, పంచాయతీ కార్యదర్శి సౌజన్య, నేతలు నరేందర్ రెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, భరత్, వనజ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌కు స్పందన అంతంతే!

- ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఆసక్తి చూపని యజమానులు
- కామారెడ్డి బల్దియాలో 5 శాతం దరఖాస్తులే పరిష్కారం
- ఈనెలాఖరు వరకు 25 శాతం రాయితీకి అవకాశం

అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్‌ఆర్‌ఎస్)కు ఫీజులో 25 శాతం రాయితీ ఇచ్చినా దరఖాస్తుదారుల నుంచి స్పందన రావడం లేదు. కామారెడ్డి బల్దియా పరిధిలో నామమాత్రంగానే ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకున్నారు. రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, అక్రమ లేఅవుట్లను రెగ్యులరైజ్ చేయించుకోవాలని బల్దియా అధికారులు ప్రచారం చేస్తున్నా ఫలితం ఉండడం లేదు.



కామారెడ్డి టౌన్ : అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకోసం ప్రభుత్వం 2020లో దరఖాస్తులు స్వీకరించింది. కామారెడ్డి మున్సిపల్ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 17,613 దరఖాస్తులు వచ్చాయి. ఈనెలాఖరు వరకు ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకుంటే ఫీజులో 25 శాతం రాయితీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కామారెడ్డి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది 12,516 మంది దరఖాస్తుదారులకు ఈ సమాచారం ఇచ్చారు. కాగా వీరిలో 3,862 మంది మాత్రమే స్పందించి క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 566 షార్ట్‌ఫాల్స్ ఉండగా మరో 594 దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. ఇప్పటివరకు 915 దరఖాస్తులను మాత్రమే పరిష్కరించారు. వీటి ద్వారా బల్దియాకు రూ. 3.50 కోట్ల ఆదాయం సమకూరింది. అంటే మొత్తం దరఖాస్తుల్లో కేవలం 5 శాతం మాత్రమే దరఖాస్తులు పరిష్కారం అయ్యాయి. ప్రభుత్వం ఈనెల 31వ తేది వరకు 25 శాతం రిబెట్ అవకాశం కల్పించింది. అయినా దరఖాస్తుదారులు క్రమబద్ధీకరణ కోసం ముందుకు రావడం లేదు.

నిషేధిత జాబితాలోని భూములకు..

మున్సిపల్ పరిధిలో బఫర్, ఎఫ్‌టీఎల్, కుంటలు, చెరువులు, ప్రభుత్వ భూములు, నిషేధిత జాబితాలో ఉన్న భూములకు ఎల్‌ఆర్‌ఎస్ వర్తించదని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ వీటి పరిధిలో భూములుంటే గతంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నప్పటికి క్రమబద్ధీకరణ చేయకూడదని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దరఖాస్తుదారులు ఎల్‌ఆర్‌ఎస్‌కు పూర్తి ఫీజు చెల్లించినా క్షేత్ర స్థాయి విచారణ అనంతరం తిరస్కరించడంతోపాటు చెల్లించిన ఫీజులో 10 శాతం కట్ చేసుకుని మిగతా డబ్బులు మాత్రమే దరఖాస్తుదారుకు చెల్లిస్తారు.

దరఖాస్తుదారులు స్పందించాలి



ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు స్పందించాలి. అక్రమ లేఅవుట్లు, ప్లాట్లను రెగ్యులరైజ్ చేయించుకోవడానికి ప్రభుత్వం ఫీజులో 25 శాతం రిబెట్ ఇస్తోంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఎల్‌ఆర్‌ఎస్ చేయించుకోకపోతే తర్వాత ఇబ్బందులు పడుతారు. నిర్మాణ అనుమతు లభించవు.

– గిరిధర్, టీపీవో, కామారెడ్డి

డీటీవో ఆఫీస్‌లో ఏసీబీ సోదాలు

- ఓ ఏజెంట్ నుంచి నగదు, ఆర్‌సీలు, మూడు లైసెన్స్‌లు స్వాధీనం
- పలు డాక్యుమెంట్లపై ప్రత్యేక కోడ్

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. ఉదయం 11.30 గంటలకు నాగారంలోని ఏసీబీ కార్యాలయానికి వెళ్లిన ఏసీబీ అధికారులు ప్రధాన గేటుకు తాళం వేశారు. అనంతరం జిల్లా కార్యాలయంతోపాటు ఆర్టీఏ అధికారుల కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. కౌంటర్ల వద్ద క్యూలో ఉన్నవారిని కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. ఆర్టీఏ ఏజెంట్ ఎండీ ఖలీల్ వద్ద నుంచి రూ.27 వేల నగదుతోపాటు 14 ఆర్‌సీలు, మూడు డ్రైవింగ్ లైసెన్స్‌లు స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. తమ సిబ్బంది డ్రైవింగ్, లెర్నింగ్, వాహనాల రిజిస్ట్రేషన్, రెన్యువల్ దరఖాస్తులను పరిశీలించారని, చాలా వాటిపై ప్రత్యేకంగా కోడింగ్ ఉందన్నారు.

అలాగే చాలా మంది ఏజెంట్లు ఆఫీస్‌లోకి వస్తున్నట్లు గుర్తించామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆర్టీఏ అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి నివేదికను అందిస్తామని తెలిపారు. ఎవరైనా అధికారులు లంచం అడిగితే ట్రోల్ ఫ్రీ నంబర్ 1064కు ఫోన్ చేయాలని లేదా 94404 46106 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

అదనపు గది.. అందుబాటులోకి రాదేమి?



పిల్లర్ల దశలో ఆగిపోయిన గది నిర్మాణం

బాన్సువాడ రూరల్: మొగులాన్‌పల్లి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతి గది శిథిలావస్థకు చేరడంతో దాన్ని తొలగించి నూతన గది నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పనులు ప్రారంభించి రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటికీ అదనపు గది అందుబాటులోకి రాలేదు. దీంతో 5 తరగతులు ఉన్న ఈ పాఠశాలలో అన్ని తరగతులు ఒకే గదిలో నిర్వహించాల్సి వస్తోంది. ప్రారంభించిన 2 నెలలకే నిలిచిపోయిన పనులను కాంట్రాక్టర్‌తో మాట్లాడి పూర్తిచేయించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అదనపు గది పనులు పూర్తిచేయించి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఆడుతూ.. పాడుతూ.. వీడ్కోలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

నిజాంసాగర్(జుక్కల్): సాంస్కృతిక కార్యక్రమాలతో పదోతరగతి విద్యార్థులకు తోటి విద్యార్థులు ఘనంగా వీడ్కోలు పలికారు. బుధవారం మహమ్మద్ నగర్‌జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆరు నుంచి పదోతరగతి విద్యార్థులు ఆటాపాటలతో ఆకట్టుకున్నారు. హెచ్‌ఎం మధుసూదన్ రాజ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌హెచ్‌వో

కామారెడ్డి క్రైం: ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి ఆటోడ్రైవర్లకు సూచించారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో బుధవారం ఆటో డ్రైవర్లు, స్థానికులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో మాట్లాడుతూ.. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్ ఎస్సై మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి

లింగంపేట(ఎల్లారెడ్డి): గ్రామ పంచాయితీల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని ఎంపీడీవో నరేష్ ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. పన్నులు చెల్లిస్తేనే గ్రామాల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగాలన్నారు. ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించాలన్నారు. ఎంపీవో మలహరి, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఉపాధి హామీ సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి సీహెచ్‌సీ పరిశీలన



రికార్డులను పరిశీలిస్తున్న అధికారి శ్రీనివాస్ ప్రసాద్

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బుధవారం జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి శ్రీనివాస్ ప్రసాద్ సందర్శించారు. ఆస్పత్రిలో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి.. ఏయే సమస్యలు ఉన్నాయనే వివరాలు తెలుసుకున్నారు. నేషనల్ క్వాలిటీ అస్సూరెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) మార్గదర్శకాలకు అనుగుణంగా ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించారు. ఈ నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి వైద్యురాలు సుప్రియ తదితరులు ఉన్నారు.

ఇసుక కుప్పలు సీజ్



నిజాంసాగర్: మండలంలోని మర్పల్లి గ్రామశివారులో అక్రమంగా డంపు చేసిన ఇసుక కుప్పలను బుధవారం మండల గిర్దావర్ సాయిబాబా సీజ్ చేశారు. గ్రామంలో 18 ట్రాక్టర్ల ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు తెలిపారు. నల్లవాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలించి డంపులు చేయడంతో సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

వర్సిటీ పేరు మారిస్తే ఊరుకోం

- రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రతిపాదనపై విద్యార్థుల ఆగ్రహం
- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం
- వీసీకి వినతిపత్రాలు అందజేసిన విద్యార్థి సంఘాలు



తెలంగాణ యూనివర్సిటీలో వీసీకి వినతిపత్రం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి నుంచి వచ్చిన ప్రతిపాదనలపై వర్సిటీ విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, కాంట్రాక్టు అధ్యాపకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏబీవీపీ, ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ, పూర్వ విద్యార్థుల సంఘం, ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్, కాంట్రాక్టు అధ్యాపకులతో పాటు రెగ్యులర్ అధ్యాపకులు సైతం వర్సిటీ పేరు మార్పు సరైన నిర్ణయం కాదని విమర్శిస్తున్నారు. బుధవారం ఉదయం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీగా వచ్చి పరిపాలనా భవనాన్ని ముట్టడించారు. కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. యూనివర్సిటీ పేరును మారిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృతచారి మాట్లాడుతూ.. ఎందరో విద్యార్థుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం వచ్చిందన్నారు. యూనివర్సిటీ పేరు మారిస్తే సీఎం రేవంత్‌రెడ్డి చరిత్ర హీనులుగా మిగిలిపోతారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విఘ్నేష్ పేర్కొన్నారు.

తెయూ పేరు మార్చడమంటే తెలంగాణ ప్రజల అస్తిత్వాన్ని దెబ్బతీయటమేనని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చే బదులు క్యాంపస్‌లో ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీను ఏర్పాటు చేసి ఈశ్వరీబాయి పేరు పెట్టుకోవాలని వర్సిటీ పూర్వ విద్యార్థులు యెండల ప్రదీప్, శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు.

అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు వీసీకి, రిజిస్ట్రార్‌కు వినతిపత్రా లు అందజేశారు. తెలంగాణ పేరు సున్నితమైన, భావోద్వేగాలతో కూడుకున్నదని ఈ పేరు మారిస్తే ప్రజల మనోభావాలు దెబ్బతినే అవకాశాలున్నాయని వీసీ టి యాదగిరి రావు అభిప్రాయం వ్యక్తం చేశారు. వర్సిటీ పేరు మార్పు ప్రతిపాదనను వర్సిటీ విద్యార్థులు, అధ్యాపకులు, జిల్లా ప్రజాప్రతినిధులు, నాయకులు, అన్ని వర్గాల ప్రజలు వ్యతిరేకిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నత విద్యామండలికి లేఖ ద్వారా తెలియజేస్తామని వీసీ పేర్కొన్నారు.



ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

యూనివర్సిటీ పేరు మార్పు తగదు



మాట్లాడుతున్న నాగరాజు

కామారెడ్డి టౌన్: తెలంగాణ యూనివర్సిటీ పేరును ఈశ్వరీబాయి యూనివర్సిటీగా మార్చాలనే ప్రక్రియను వెంటనే వెనక్కి తీసుకోవాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఉన్నత విద్యామండలి నుంచి వచ్చిన ప్రతిపాదనను వర్సిటీ అధికారులు తిరస్కరించాలన్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలంగాణ పేరుతో ఏర్పడిన యూనివర్సిటీ పేరు మారిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్. దయాకర్, నాయకులు రంజిత్, సత్యం, మధు, అరవింద్, ధరం సింగ్ , ఈశ్వర్, శ్రీరామ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆ నిర్ణయం సరైంది కాదు

గాంధారి(ఎల్లారెడ్డి): తెలంగాణ ప్రభుత్వం నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి శివారులో ఏర్పాటు చేసిన తెలంగాణ యూనివర్సిటీ పేరు మార్చాలని నిర్ణయించడం సరైందని కాదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అనుముల సతీష్ అన్నారు. ఎన్నో ప్రాణ త్యాగాలతో తెలంగాణను సాధించుకున్నామన్నారు. నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోస్టల్ ద్వారా రాములోరి తలంబ్రాలు

నిజామాబాద్ రూరల్: శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలోని సీతారాముల వారి కల్యాణోత్సవ తలంబ్రాలను తపాలశాఖ ద్వారా భక్తులకు అందించేలా సేవలను ప్రారంభించినట్లు పోస్టల్ శాఖ నిజామాబాద్ సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం ఈ సేవలను రాష్ట్ర దేవాదాయ శాఖతో ఒప్పందం చేసుకొని ముందుకు తీసుకువచ్చామని పేర్కొన్నారు. స్పీడ్ పోస్టు ద్వారా తలంబ్రాలు 10 గ్రాములు, ఒక ముత్యం, పసుపు, కుంకుమ, మిస్త్రీ, కాజు, 80 గ్రాముల ప్రసాదం కోసం భక్తులు తమ దగ్గరలోని పోస్టాఫీసుకు వెళ్లి రూ.450 చెల్లించి బుక్ చేసుకోవచ్చన్నారు. ఏప్రిల్ 1 వరకు సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

చిరుత సంచారం.. ప్రజల్లో కలవరం

- అధికారులు బంధించాలంటున్న అబ్బాపూర్, అల్జాపూర్ గ్రామస్తులు
- సంచార ప్రదేశాలను పరిశీలించిన అటవీశాఖ అధికారులు



అబ్బాపూర్(ఎం)లో చిరుత దాడిలో మృతిచెందిన ఆవును పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

నవీపేట: నవీపేట మండలం అల్జాపూర్, అబ్బాపూర్(బి) గ్రామాల్లో చిరుత పులుల సంచారం చుట్టు పక్కల గ్రామాల ప్రజలను కలవరపెడుతోంది. మండలంలోని వివిధ గ్రామాలు గుట్టలకు ఆనుకుని ఉండడంతో అటవీ జంతువులు జనవాసాల మధ్య సంచరిస్తున్నాయి. రెండు రోజుల క్రితం అల్జాపూర్-యంచ గ్రామాల మధ్య చెరువుకు తాగునీటి కోసం రెండు చిరుతలు రాగా శివారులో ఉన్న రైతులు భయాందోళనకు గురయ్యారు. గతంలో ఇదే ప్రాంతంలో చిరుత దాడిలో మేకలు మృత్యువాత పడ్డాయి. మళ్లీ కనిపించడంతో అప్రమత్తమైన ఫారెస్ట్ అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. నందిగామ-అల్జాపూర్-యంచ గ్రామాలను ఆనుకుని ఉన్న గుట్టల్లో రోడ్లు దాటుతూ రెండు చిరుతలు సంచరిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

అబ్బాపూర్ గుట్టల్లో నాలుగు చిరుతలు

నెల రోజుల క్రితం మండలంలోని అబ్బాపూర్ (ఎం) శివారులోని గుట్ట అంచున ఉన్న పశువుల పాకపై చిరుత దాడి చేసి రెండు ఆవులను చంపేసింది. ఎడపల్లి, రెంజల్, నవీపేట మండలాల పరిధిలోని పలు గ్రామాలను ఆనుకుని దట్టంగా ఉన్న అడవిలో చిరుతలు, దుప్పిలు, అడవి పందులు, ఇతర జంతువులు ఉన్నట్లు గతంలో అధికారులు గుర్తించారు. మరో నాలుగు చిరుతలు ఈ దట్టమైన ప్రాంతంలో ఉన్నాయని తెలిపారు. మోకన్‌పల్లి శివారులోని చిన్నపాటి గుట్ట సమీపంలోని ఉన్న ఇటుక బట్టీ దగ్గర ఏడాది క్రితం కనిపించిన తల్లీ, పిల్ల చిరుతలను చుట్టు పక్కల గ్రామాల వాసులను భయభ్రాంతులకు గురి చేశాయి.

దాడి తీవ్రమైతే బంధిస్తాం

మండలంలోని అబ్బాపూర్(ఎం), అల్జాపూర్ గ్రామాల అటవీ ప్రాంతంలో చిరుతలు సంచరిస్తున్నాయి. దట్టమైన అబ్బాపూర్ అటవీ ప్రాంతంలో నాలుగు చిరుతలు, అల్జాపూర్ శివారులో జంట చిరుతలు ఉన్నాయి. ఈ ప్రాంతాల్లోని చిరుతలు ఇంత వరకు మనుషులపై దాడి చేయలేదు. చిరుతల దాడి తీవ్రమైతే బంధిస్తాం.

– జిప్రూరా, సెక్షన్ ఆఫీసర్ (నిజామాబాద్ రేంజ్)

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వైద్యుడు మృతి



హన్మాండ్లు(ఫైల్)

ఖలీల్‌వాడి: నగరంలోని పులాంగ్ చౌరస్తా వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయుర్వేద వైద్యుడు హన్మాండ్లు(52) మృతి చెందినట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నందిపేట్ మండలం తల్వేదకు చెందిన ఆయుర్వేద వైద్యుడు హన్మాండ్లు నగరంలోని గోల్‌హనుమాన్‌వద్ద వాసవి ఆయుర్వేద ఆస్పత్రిని నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం వినాయక్‌నగర్‌కు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా పులాంగ్ చౌరస్తా వద్ద సిగ్నల్ ప్రాంతంలో టిప్పర్ ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ హన్మాండ్లును స్థానికులు ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అదే బైక్‌పై ఉన్న మరో వ్యక్తి శ్రీహరికి స్వల్ప గాయాలయ్యాయి. శ్రీహరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ మహిళ ..

మాక్లూర్: కుటుంబ కలహాలతో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఓ మహిళ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మాక్లూర్ మండలం మెట్‌పల్లి గ్రామానికి చెందిన దుంపల సాయమ్మ(45) ఈనెల 6న భర్తతో గొడవపడి క్షణికావేశంలో పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు వెంటనే మంటలను ఆర్పివేసి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

లింగంపేటలో ఒకరు..

లింగంపేట: గేదె బైక్‌ను ఢీకొన్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన లింగంపేట మండలం గాంధీనగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన అవుసుల సాయిలు(52), అవుసుల రాజు ఈ నెల 7న బైక్‌పై ఎర్రపహాడ్ సమీపంలోని పంట చేను వద్దకు వెళ్లారు. రాజు గేదెను తీసుకొని వస్తుండగా సాయిలు బైక్‌పై వస్తుండగా మోతె శివారులో గేదె బైక్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో కిందపడ్డ సాయిలు తలకు తీవ్రగాయమైంది. కుటుంబీకులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈ క్రమంలో మృతుడి కుటుంబ సభ్యులు రాజు ఇంటి ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుక్ను ఎస్సై వెంకట్రావు ఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించి విరమింపజేశారు. అనంతరం బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు.

డ్రంకన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

ఖలీల్‌వాడి: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ నలుగురికి రెండు రోజుల జైలు శిక్షను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ బుధవారం తెలిపారు. నగరంలోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి నడిపిన 17 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వీరికి నగరంలోని ట్రాఫిక్ పీఎస్‌లో కౌన్సెలింగ్ ఇచ్చి జడ్జి ఎదుట హాజరుపర్చినట్లు తెలిపారు. జడ్జి నలుగురికి రెండు రోజుల జైలు శిక్షను, 13 మందికి జరిమానా విధించినట్లు వెల్లడించారు.

వాహనం ఢీకొని జింక మృతి



బోధన్‌రూరల్: బోధన్ మండలం రాంపూర్, కల్దుర్కి రాజన్న చౌరస్తా వద్ద బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు బోధన్ రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. పోలీసు సిబ్బంది జింకకు నీరు తాగించినా కోలుకోలేదని, కొద్ది సేపటికి మృతి చెందిందని స్థానికులు తెలిపారు. పోలీసులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో మూడు షాపులు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఆర్మూర్‌టౌన్: షార్ట్‌సర్క్యూట్‌తో మూడు షాపులు దగ్ధమైన ఘటన పెర్కిట్ పరిధిలో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పెర్కిట్ పెట్రోల్ బంక్ సమీపంలో ఉన్న కిరాణ షాప్, ఆటోమొబైల్‌షాప్, హోటల్ దుకాణాల నుంచి ఉదయం పొగలు వస్తున్నట్లు గుర్తించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. మూడు దుకాణాల్లో ఉన్న సామగ్రి అగ్నికి ఆహుతైంది. జిల్లా అగ్నిమాపక అధికారి పరమేశ్వర్, అగ్నిమాపక అధికారి మధుసూదన్ రెడ్డి, ఆర్మూర్ పోలీసులు, రెవన్యూ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. సుమారు రూ. 24 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు బాల్‌రాజ్, గోపాల్, ముగ్దుమ్ తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

మహిళా శక్తి క్యాంటీన్లతో సాధికారత

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి
- దోమకొండలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్ తనిఖీ



దోమకొండలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్‌లైన్ డెస్క్‌ను పరిశీలించి సూచనలిస్తున్న అదనపు కలెక్టర్

దోమకొండ: ప్రభుత్వం మహిళా సాధికారత కోసం మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహిస్తూ ఏర్పాటు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి చెందొచ్చని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ ఆవరణలో ప్రారంభమైన మహిళా శక్తి క్యాంటీన్‌ను సందర్శించి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఎల్‌ఆర్‌ఎస్ హెల్ప్ డెస్క్‌ను సందర్శించి సిబ్బందితో మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుదారులు ఈ నెల 31 వరకు తమ ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేసుకోవాలన్నారు. అంతకుముందు ఆయన మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. మండల ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, తహసీల్దార్ సంజయ్‌రావ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపగడ్డ పరిరక్షణకు కృషి..

దోమకొండలోని గడికోట ఎదురుగా ఉన్న ఉపగడ్డ పరిరక్షణకు కృషి చేస్తామని ఆయన అన్నారు. దాని ప్రాధాన్యతను గడికోట ట్రస్టు ప్రతినిధులు ఆయనకు వివరించారు. మేనేజర్ బాల్జీ, తదితరులు ఉన్నారు.

బోరు వట్టిపోయింది.. పొలం ఎండి పోతోంది



చుక్కాపూర్‌లో నెర్రెలు బారిన వరి పొలం

మాచారెడ్డి: మండుతున్న ఎండలకు తోడు బోరు బావులు వట్టి పోవడంతో పంట చేతికొచ్చే దశలో ఎండిపోతోంది. ఎండుతున్న పంటను చూసి రైతులు విలవిల్లాడుతున్నారు. చేసేదేమీ లేక పశువులను మేపుతున్నారు. ఇప్పటికి మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లో సగానికి పైగా వరి పంట ఎండి పోయినట్లు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చుక్కాపూర్ గ్రామానికి అంజల్ రెడ్డి అనే రైతు నాలుగు ఎకరాల వరి సాగు చేస్తే ఇప్పటికి ఒకటిన్న ఎకరం పొలం నెర్రెలు బారింది.

పెట్టుబడి కూడా రాదు



విత్తనాల నుంచి మొదలు కొని నాటు, ఎరువులకు పెట్టిన పెట్టుబడి కూడా రాకుండా పోతోంది. ఎకరానికి రూ.25వేలు పెట్టుబడి పెట్టాం. చివరికి ఆ పెట్టుబడి కూడా రాకుండా అప్పుల పాలు కావాల్సి వస్తోంది. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి.

– అంజల్ రెడ్డి, రైతు, చుక్కాపూర్

మాజీ సర్పంచుల ముందస్తు అరెస్ట్



లింగంపేటలో మాజీ సర్పంచులతో ఎస్సై వెంకట్రావు



భిక్కనూరులో..



మాచారెడ్డిలో..

లింగంపేట/భిక్కనూరు/మాచారెడ్డి: పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరుతూ మాజీ సర్పంచులు బుధవారం అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. హైదరాబాద్ బయలుదేరుతున్నారన్న సమాచారం మేరకు బుధవారం వేకువజామున లింగంపేట, భిక్కనూరు, మాచారెడ్డి మండలాల పరిధిలో మాజీ సర్పంచులను, మాజీ మహిళా సర్పంచుల భర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అనంతరం సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు.

తాగిన మైకంలో ఏఆర్ కానిస్టేబుల్ వీరంగం

తమ్ముడి భార్య, పిల్లలపై దాడి

భిక్కనూరు: తాగిన మైకంలో ఏఆర్ కానిస్టేబుల్ వీరంగం సృష్టించాడు. ఘటనకు సంబంధించి ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన సంతోష్‌గౌడ్ ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ వద్ద విధులు నిర్వహిస్తున్నాడు. ఆస్తి పంపకాల విషయంలో ఏఆర్ కానిస్టేబుల్ సంతోష్, సోదరుడు వేణుతో తరచూ గొడవ జరిగేది. వీరి నివాసాలు పక్కపక్కనే ఉంటాయి. తాగిన మైకంలో ఉన్న సంతోష్ తల్లిదండ్రులతో ఆస్తి పంపకాల విషయమై గొడవ పడుతూ ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేశాడు. అదే సమయంలో ఓ స్కూల్‌లో ఉపాధ్యాయులిగా పనిచేస్తున్న తమ్ముడి భార్య నవ్య ఇంటికి చేరుకుంది. గొడవ జరుగుతున్న విషయాన్ని సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తుండగా విషయాన్ని గమనించిన ఆయన కోపంతో కర్రతో ఆమెపై, పిల్లలపై దాడి చేశాడు. ఆమె సెల్‌ఫోన్‌ను కిందపడేశాడు. ఇంట్లో వేణు లేకపోవడంతో స్థానికులు అతనికి ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో అతను స్నేహితుడు సతీశ్‌గౌడ్‌తో కలిసి ఇంటికి కారులో వచ్చారు. తన భార్యను కొట్టడంతో ఆగ్రహించిన వేణు, అన్నపై దాడికి యత్నించాడు. కోపంలో సంతోష్‌గౌడ్ అక్కడే ఉన్న కారు అద్దాలను ధ్వంసం చేశాడు. దీంతో అన్నదమ్ములు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో సంతోష్ కింద పడడంతో తలకు గాయమైంది. సంతోష్‌గౌడ్, మరదలు నవ్య స్థానిక పీఎస్‌లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. నవ్య ఫిర్యాదు మేరకు కానిస్టేబుల్ సంతోష్‌గౌడ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చోరీ కేసులో నిందితురాలి అరెస్టు



మాట్లాడుతున్న సీఐ రవీందర్‌నాయక్

ఎల్లారెడ్డి: వృద్ధురాలి మెడలో నుంచి బంగారం చోరీ చేసిన కేసులో నిందితురాలిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రవీందర్‌నాయక్ తెలిపారు. స్థానిక పీఎస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లికి చెందిన కాశవ్వ అనే వృద్ధురాలు ఈనెల 9న ఎల్లారెడ్డికి వారాంతపు సంతకు వచ్చింది. స్వగ్రామానికి వెళ్లేందుకు స్థానిక పెట్రోల్ బంక్ వద్ద ఆటో కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఎల్లారెడ్డికి చెందిన ఏసవ్వ వృద్ధురాలితో మాటాలు కలిపింది. తాను కూడా అటు వైపే వెళ్తున్నానని అంబేడ్కర్ చౌరస్తా వద్ద తక్కువ రేటుకు ఆటోలు వస్తాయని చెప్పి చర్చి కాంపౌండ్ సమీపంలోని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లింది. అక్కడ కాశవ్వ కంట్లో కారంపొడి చల్లి ఆమె మెడలో ఉన్న రెండు తులాల గుండ్లు, రెండున్నర తులాల పుస్తెల తాడును ఎత్తుకెళ్లింది. మరుసటి రోజు కాశవ్వ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. బుధవారం గాంధీచౌక్ ప్రాంతంలో ఏసవ్వ అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఆమెను పట్టుకున్నారు. బంగారాన్ని ఎత్తుకెళ్లినట్లు ఏసవ్వ ఒప్పుకోవడంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై మహేశ్, సిబ్బంది అనిల్‌గౌడ్, అర్చన తదితరులు పాల్గొన్నారు.

బైక్ దహనం

ఎడపల్లి: మండల కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున ఓ బైక్‌ను దుండగులు దహనం చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. ఎడపల్లికి చెందిన చింటు తన బైక్‌ను తన ఇంటి ఎదుట నిలిపి నిద్రించాడు. ఉదయం 3 గంటల ప్రాంతంలో దుండగులు బైక్‌కు నిప్పంటించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కమ్మర్‌పల్లి: మండల పరిధిలోని గాంధీనగర్‌లో పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై అనిల్‌రెడ్డి బుధవారం తెలిపారు. కడమంచి రవి అనే వ్యక్తి ఓ వాహనంలో రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడనే సమాచారం మేరకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. పట్టుకున్న బియ్యం మూడు

ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ కాయిల్స్ చోరీ



పరిశీలిస్తున్న అధికారులు

నాగిరెడ్డిపేట: నాగిరెడ్డిపేట మండలం పోచారం శివారులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ కాయిల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. వీటి విలువ రూ. 60 వేల వరకు ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్లను డీఈ విజయసారథి, ఏడీ నాగేందర్‌రెడ్డి, ఏఈ నాగరాజు పరిశీలించారు. చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు అధికారులు తెలిపారు.